ప్రజాశక్తి

శనివారం 4 మార్చి 2023 8 పేజీలు




ప్రకాశం బాపట్ల

అప్పులు తీర్చలేక

ఆయువు తీసుకున్నాడు..

లారీ కిందపడి రైతు ఆత్మహత్య



రైతు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అద్దంకి (బాపట్ల జిల్లా)

అప్పుల బాధతో లారీ కిందపడి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన అద్దంకి మండలంలోని శంఖవరప్పాడులో జరిగింది. గ్రామానికి చెందిన సోము పిచ్చిరెడ్డి(36)కి కుటుంబసభ్యుల పేరుతో మూడు ఎకరాల పొలం ఉంది. పొలంతో పాటు కొంత భూమిని కౌలుకు తీసుకొని పత్తి, వరి, మిర్చి పంటలు సాగు చేస్తున్నాడు. గత ఐదు సంవత్సరాల నుండి పంటల దిగుబడి సరిగ్గా రాక అప్పులు పెరిగిపోయాయి. మొత్తం 11 లక్షల రూపాయల వరకు అప్పులున్నాయి. ఈ అప్పులను ఎలా తీర్చాలో తెలియక చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం ఉదయం గ్రామంలోని ఓ ఇంటి వద్ద విద్యుత్ మీటర్ వద్ద తీగలు పట్టుకోవాలని ప్రయత్నించగా పక్కన ఉన్నవాళ్లు కాపాడారు. ఉదయం 10 గంటల సమయంలో శంఖవరప్పాడు నుండి బల్లికురవ వెళ్తున్న గ్రానైట్ లారీ వెనుక చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సిఐ ఎం.రోశయ్య ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మతునికి భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. మతుని భార్య వెంకటరమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆదిలక్ష్మి వెల్లడించారు.



ఒంగోలులో నిరసన తెలుపుతున్న ఐద్వా నేతలు

గ్యాస్ ధర తగ్గించాల్సిందే..

బాత్‌రూములు, మరుగుదొడ్లు..

మా పిల్లలతోనే కడిగిస్తున్నారు..

- మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు..
- ఐటిడిఏ పీవోను చుట్టుముట్టిన విద్యార్థినుల తల్లిదండ్రులు



పీవోతో మాట్లాడుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

'పాఠశాలలో పరిసరాలు శుభ్రంగా ఉండవు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు.. బాత్ రూములు, మరుగుదొడ్లను సైతం మా పిల్లలతోనే కడిగిస్తున్నారు' అని అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దదోర్నాలలోని ఏకలవ్య బాలికల మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై.. అక్కడి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు పొందుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం 75 మంది విద్యార్థినులు ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. ఆ వైద్యశాల సూపరింటెండెంట్ భాస్కర్ కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు విద్యార్థినులకు చికిత్సలు అందించారు. ఈ క్రమంలో సాయంత్రానికి 69 మంది విద్యార్థినులు డిశ్చార్జ్ అయ్యారు. మిగతా వారిలో ముగ్గురిని మార్కాపురంలోని వంద పడకల వైద్యశాలకు తరలించారు. మరో ముగ్గురు విద్యార్థినులు పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలలోనే కోలుకుంటున్నారు. వీరిని పరామర్శించిన ఐటిడిఏ పీవో రవీంద్రారెడ్డిని విద్యార్థినుల తల్లిదండ్రులు చుట్టుముట్టారు. తమ పిల్లలు అస్వస్థతకు గురి కావడానికి కారణం పాఠశాల సిబ్బందే అని ఆరోపించారు. అనంతరం మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ చికిత్సలు పొందుతున్న ▶ 2లో

పిడిఎఫ్ అభ్యర్థులకు

పెరుగుతున్న ఆదరణ

- ప్రచారంలో అన్ని వర్గాలనూ కలుస్తున్న అభ్యర్థులు
- మద్దతుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, మహిళ, యువజన సంఘాలు
- సంఘీభావం ప్రకటించిన వామపక్షాలు, జనసేన



అద్దంకిలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ విఠపు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ కూటమి అభ్యర్థులకు ఆదరణ పెరుగుతోంది. ఇప్పటికే మూడు పర్యాయాలు గెలిచి అనేక సమస్యలపై మండలిలో తమదైన శైలిలో వాణిని విని పిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళన ల్లో కీలక పాత్ర పోషించారు. ఉద్యమాలకు దిక్సూచిగా ఉన్నారు. వీరికి ఇప్పుడు అన్ని వర్గాల నుంచి ఆదరణ పెరుగుతోంది. మం డలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఉండాలనే భావన ఓటర్లలో వ్యక్తమవుతోంది. ప్రచారంలో ఇదే స్పష్టమవుతోంది.

రెండు నెలలకు పైగా పిడిఎఫ్ అభ్యర్థులు ప్రచారంలోనే ఉన్నారు. ఓటర్లుగా ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు ఉద్యోగులు, అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు టీచర్లు, యువజనులు.. గ్రాడ్యుయేట్లుగా ఉంటూ వివిధ రంగాల్లో పనిచేసేవారందరినీ కలుస్తున్నారు. అందరిలోనూ మీరుండాలి అనే భావన వ్యక్తమవుతోంది. అభ్యర్థులు కలిసినప్పుడు ఇదే చెబుతున్నారు. జనం గళం వినిపించాలంటే మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఉంటేనే.. అనే చర్చ కూడా సర్వత్రా వినిపిస్తోంది. అనేక సమస్యలను అక్కడ ప్రస్తావించారు. ఉద్యమాలకే పరిమితం కాకుండా అభివృద్ధిపైనా దృష్టి సారించారు. జిల్లాల వెనకబాటుతనం, ప్రత్యేక హోదా, వెలుగొండ ప్రాజెక్టు, పరిశ్రమలు, పోర్టులు వంటి వాటిపైనా మాట్లాడారు. రాజధానిపైనా స్పష్టమైన వైఖరితో ముందుకు పోయారు. అమరావతినే కొనసాగించాలని కోరారు. ఇలా కీలకమైన అంశాలపై స్పష్టమైన విధివిధానాలతోనే పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నడుస్తున్నారు. అందుకే మూడు సార్లు వారికే ఓటర్లు పట్టం కట్టారు. రాజకీయపార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఈ అంశాలపై అవగాహనే ఉండదనే చర్చ కూడా ఉంది. ఉద్యోగులు ఇటీవల కాలంలో చేపట్టిన పిఆర్‌సి, సిపిఎస్ రద్దు పోరాటాలకు కీలకపాత్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీలే పోషించారు. ఉద్యోగ సంఘాలు ప్రభుత్వ ఒత్తిళ్లకు ▶ 2లో

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి: విఠపు

ప్రజాశక్తి-అద్దంకి

రాష్ట్రప్రభుత్వం ఎమ్మెల్సీ ఎన్నికలను సాంప్రదాయబద్ధంగా, సజావుగా జరిపేందుకు కూడా ఇష్టం లేని రీతిలో ప్రవర్తిస్తోందని, పాఠశాలలలో పనిచేయని వారిని కూడా ఉపాధ్యాయులుగా ఓట్లు చేర్పించడంలో ప్రభుత్వం ముందుందని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. శుక్రవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ దొంగ ఓట్లు చేర్చడంలో ఎప్పుడూ లేనివిధంగా తప్పుడు విధానాలు అవలంబించిందన్నారు. పోరాటాల ద్వారా కొంతవరకు నిలుపుదల చేశామన్నారు. పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీగడ వెంకటేశ్వరరెడ్డిని, ఉపాధ్యాయ అభ్యర్థిగా పి.బాబురెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ సిఐటియు, కార్మిక సంఘాల తరపున శాసనమండలికి పిడిఎఫ్ అభ్యర్థులను బలపరుస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల గొంతునొక్కే ప్రయత్నంలో ఉందన్నారు. అనంతరం ఎల్ఐసి నాయకులు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బి.విజయ్‌కుమార్, జి.వెంకట్రావు, ఎల్ఐసి నాయకులు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులకు పెరుగుతున్న ఆదరణ

(మొదటిపేజీ తరువాయి)

తటపటాయిస్తున్నా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రం ఉద్యోగులకు అండగానే ఉన్నారు. పిడిఎఫ్‌లో కీలకపాత్ర పోషించే యూటిఎఫ్ రాజీలేని ధోరణితో ఉంది. అందుకే ప్రభుత్వం ఉపాధ్యాయులపై కఠినంగా ఉంది. ప్రైవేటు టీచర్లతో అక్రమాలకు పాల్పడాలనే ఆలోచనలు చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ప్రైవేటు ఉపాధ్యాయులపై ఒత్తిళ్ళు చేసి తమకు అనుకూలంగా ఓటేయించుకునే ఆలోచన చేస్తున్నారు. ఈ చర్యలను ఉద్యోగ, కార్మిక వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ సారి వైసిపి, తెలుగుదేశం అభ్యర్థులు రంగంలోకి దిగారు. ఇరువురూ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగానే తీసుకున్నారు. ఉద్యోగ వర్గాల్లో రెండు పార్టీలపై ఒకే అభిప్రాయం ఉంది. అనేక హామీలపై రెండు పార్టీల ధోరణి ఒకటే. పిఆర్‌సీల అమలు, కాంట్రాక్టు ఉద్యోగుల పర్మినెంట్, సిపిఎస్ రద్దు వంటి విషయాల్లో రెండు పార్టీల్లో పెద్ద తేడా లేదు. ఒకే వైఖరితోనే ఉన్నాయి. చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు అమలు చేయని అంశాలను తాను అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామని జగన్ పాదయాత్రలో చెప్పారు. వచ్చాక పరిస్థితి ఏమిటో ఉద్యోగులే చూస్తున్నారు. హామీల అమలు ఎలా ఉందో ఇపుడు సాగుతోన్న పోరాటాలే అద్దం పడుతున్నాయి. ఇక పిడిఎఫ్ అభ్యర్థులకు వందకుపైగా వివిధ సంఘాల మద్దతు ఉంది. గతంలోనూ ఉంది. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు, మహిళా సంఘాలు, ఎన్జీఓలు మద్దతుగా ఉన్నారు. కొందరు ప్రభుత్వ ఒత్తిళ్లకు భయపడి బయటకు రాలేకపోతున్నా పిడిఎఫ్‌కే తమ మద్దతు అని గట్టిగానే చెబుతున్నారు. రాజకీయ పార్టీలు సంఘీభావం ప్రకటించాయి. సిపిఎం, సిపిఐ గతంలోనూ సంఘీభావం ప్రకటించాయి. తాజాగా జనసేన పార్టీ కూడా పిడిఎఫ్‌కు మద్దతు ప్రకటించింది. ఇలా అన్ని వైపుల నుంచీ మద్దతు పెరుగుతోంది.

బాత్‌రూములు, మరుగుదొడ్లు.. మా పిల్లలతోనే కడిగిస్తున్నారు..

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థినులతో మాట్లాడారు. ఆ తర్వాత ఏకలవ్య పాఠశాలను పరిశీలించారు. అక్కడ నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును సందర్శించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో విడివిడిగా సమావేశం నిర్వహించారు. మోడల్ పాఠశాల నందు అందుబాటులో ఉన్న సౌకర్యాల పట్ల ఆరా తీశారు పలు సూచనలు చేశారు.

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తా..

పెద్దదోర్నాలలోని ఏకలవ్య బాలికల మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. పరిసరాలు, మరుగుదొడ్ల, డైనింగ్ హాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఐటిడిఎ పీవో రవీంద్రారెడ్డి, ఐటిడిఎ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్, తహశీల్దారు వేణుగోపాల్, పాఠశాల ప్రిన్సిపల్ శామ్యూల్ జోబ్ పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం : డిఇఒ

ప్రజాశక్తి - గిద్దలూరు

పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యమని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ తెలిపారు. గిద్దలూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డిఇఒ పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థికి లక్ష్య సాధన ఉండాలన్నారు. దానిని చేరువయ్యేలా చదువులో రాణించాలని తెలిపారు. విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. ఏ రోజు పాఠాలు ఆరోజే ఎవరైతే పూర్తి చేస్తారో వారే నూరుశాతం మార్కులతో ఉత్తీర్ణ సాధిస్తారని చెప్పారు. సబ్జెక్టులలో సందేహాలు వస్తే వెంటనే ఆయా ఉపాధ్యాయుల వద్ద నివత్తి చేసుకోవాలన్నారు. అనంతరం ఉపధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నరసింహారావు, ప్రధానోపాధ్యాయులు సిద్దేశ్వరశర్మ,ఉపాల్గొన్నారు. **కంభం రూరల్ :** మండల పరిధిలోని జంగంగుంట్ల (ఎంఆర్) పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, పాఠశాల పరిసరాలు, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనం తయారీ మెనూ పరిశీలించి సూచనలు చేశారు.అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, చతుర్విద ప్రక్రియలపై అవగాహన కల్పించారు. వర్క్ బుక్స్ మరియు నోట్ బుక్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కెబి.రామయ్య, పాల్గొన్నారు,.

భవన నిర్మాణాలు పరిశీలన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

పునరావాస కాలనీల్లో నిర్మిస్తున్న భవన నిర్మాణాల్లో తప్పక నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఉప కలెక్టర్ సేతుమాధన్ తెలిపారు. మండల పరిధిలోని గోగులదిన్నె గ్రామ సమీపంలో నిర్మిస్తున్న పునరావాస కాలనీ భవనాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ కాలనీలో నిర్మిస్తున్న హైస్కూల్ భవన నిర్మాణ పనుల గురించి ఆధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ మంత్రు నాయక్, గుత్తేదారు భీమవరం వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు పట్టివేత

టంగుటూరు : అక్రమంగా తరలిస్తున్న గ్రేడ్ 1 రకం పొగాకును బేళ్లను బోర్డు విజిలెన్స్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పొగాకు బోర్డు పరిధిలోని నందనవనం గ్రామం నుంచి గురువారం అర్ధరాత్రి సమయంలో టాటా మ్యాజిక్ వాహనంలో 2,950 కిలోల 20 పొగాకు బేళ్లను తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్లో ఈ పొగాకు విలువరు రూ.5 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు, బోర్డు విజిలెన్స్ అధికారులు హర్ష, టి.రామకష్ణ, జస్వంత్, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు టిడిపి లీగల్‌సెల్ సమావేశం

ప్రజాశక్తి -శింగరాయకొండ

మంగళగిరిలోని సికే కన్వెన్షన్‌లో రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి టిడిపి లీగల్ సెల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఒంగోలు పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు కోరారు. ఈ సమాశానికి ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని టిడిపి లీగల్ సెల్ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులపై పెట్టిన అక్రమ కేసులు, లోకేష్ యువగళం పాదయాత్రకు పోలీసులు కలిగిస్తున్న ఆటంకాలు, వచ్చే ఎన్నికల్లో లీగల్ సెల్ బాధ్యతలు తదితర అంశాల గురించి చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి లీగల్ సెల్ సభ్యులందరూ హాజరు కావాలన్నారు.

మహారాజశ్రీ ఒంగోలు అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

IP NO : 14/2017

సయ్యద్ అల్లాభక్షు .... పిటిషనర్

వర్సెస్

షేక్ సికారి అహమ్మద్ షరీఫ్ మరియు కొందరు .... రెస్పాండెంట్లు

To

అర్3, ఏనుగంటి భక్తవత్సలం భర్త నాట్ నౌన్, అరుణోదయ కాలనీ ఒంగోలు

అర్8, షేక్ లతీఫ్ తండ్రి పెద్ద లతీఫ్ పీర్ల మన్యం , ఒంగోలు

అర్10, షేక్ నాగూర్ తండ్రి చిన మస్తాన్ నివాసం పిర్లమాన్యం సెకండ్ లైన్ ఒంగోలు

పై కేసులో IP 14/17 లో ప్రతివాదులపైIP కేసును దాఖలు చేయగా కోర్టువారు ఈ నోటీస్ నిమిత్తం 10-03-2023 తేదికు కోర్టు వారు పబ్లికేషన్‌కు ఆర్డర్ వేసిఉన్నారు కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఈ పేపర్ ద్వారా నోటీస్ పంపడమైనది కావున మీరు 10-03-2023 తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం 10 గంటల 30 నిమిషాలకు స్వయంగా గాని లేదా లాయర్ గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవల్సింది లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

ఇట్లు
బొడ్డు భాస్కరరావు
న్యాయవాది, ఒంగోలు
9848793090

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి.నెం:28/2022
ఇన్
ఓ.ఎస్.నెం:137/2021

ఆళ్ల సుజాత ... డి.హెచ్.ఆర్/వాది

వర్సెస్

ఆళ్ల వెంకటరెడ్డి ...జె.డి.ఆర్./ప్రతివాది

టు,

ఆళ్ల వెంకట రెడ్డి తండ్రి నిమ్మారెడ్డి, గుండ్ల సముద్రం గ్రామం, మర్రిపూడి మండలం, ప్రకాశం జిల్లా. అనువారికి,

పై నంబరు ఇ.పి. వేలం నిమిత్తం దాఖలు చేసినందున, ఇ.పి షెడ్యూల్ ఆస్తిని జప్తి చేసినందున రూల్ 54 నోటీసు నిమిత్తం, నీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు నీకు నోటీసులు పంపించినన్నూ జారీ కానందున శ్రీ కోర్టు వారు నీ నోటీసు నిమిత్తం వాయిదా తేదీ: 06-03-2023కు వాయిదా వేసి ఉన్నారు. కావున పై తేదీన ఉదయం 10:30 గంటలకు నీవు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా కానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో నీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ: 06-03-2023

పొదిలి
తేది:03-03-23

ఇట్లు
ఎం.వి.రమణ కిషోరు,
బి.కామ్,ఎల్.ఎల్.బి.
అడ్వకేట్ మరియు నోటరీ,
పొదిలి, ప్రకాశం జిల్లా,
సెల్ :9948139224.

వేలం ప్రకటన

మహారాజశ్రీ ఒంగోలు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP No : 68/2019
OS No : 455/2016

గాదె చక్రమ్మ ....డి.హెచ్.ఆర్

వర్సెస్

ముడుసు తులసి @ రామతులసమ్మ .... జె.డి.ఆర్

ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి ఎదుట 24-03-2023 తేదీన బహిరంగ వేలం జరుగును వేలంలో ఎవరైనా పాల్గొన వచ్చును షెడ్యూల్ గురించి ఇతర వివరములు కావలసినవారు డి.హెచ్.ఆర్ ఆఫీసు నందు సంప్రదించగలరు.

షెడ్యూలు

PrakasamDistrict Registration -Ongole Sub Registration An extent of Ac.1.28 cents in S.No.634/1 of Konijedu village Tangutur Mandal within the jurisdiction of this Honourable Court.

East : Manam China Venkaiah and Mandam Peda Venkaiah.
South: Gowravarpau Piotchamma and Tanniru Seshaiah.
West: Gottipati Buchaiah.
North : Chidipudi Seshamma and Ponugumati Chenchuramaiah.
DHR Value Rs 300,000/-
Amin Value Rs 500,000/-
Market value Rs 7,04,000/-
వేలం వాయిదా **24-03-2023**
తదుపరి వాయిదా **31-03-2023**

ఇట్లు
పాలపర్తి శ్రీనారెడ్డి
అడ్వకేట్,ఒంగోలు

జనరల్ నోటీసు

ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

E.A No. 282/2022
EP.No. 49/2021

జాలాది రాజ్యలక్ష్మి .....డిక్రిహోల్డర్

Vs

దామచర్ల కోటేశ్వరమ్మ (లేట్) మరియు కొందరు .....జడ్జిమెంట్ డెట్టర్

To.
R3

చెన్నారెడ్డి శ్రీలత, (3వ రెస్పాండెంట్)
W/o చెన్నారెడ్డిరాజ, C/o చెన్నారెడ్డి హనుమంత రావు,ముప్పరాజువారి పాలెం గ్రామం, కొండెపి మండలం, ప్రకాశం జిల్లా.

పై నంబరు కేసులో మీ నోటీసు నిమిత్తము ఎన్ని సార్లు నోటీసు పంపినా, నోటీసు చేరనందున శ్రీ కోర్టు వారు ప్రజాశక్తి పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు.కావున ఈ ప్రకటన చూసిన తరువాత తేది. 14-03-2023 ఉదయం 10.30 లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగాగాని, అడ్వకేటు ద్వారా గాని హాజరై మీయొక్క సమాధానం తెలుపుకొనవలసినది. లేని యెడల పై తెలిపిన కేసు మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

ఇట్లు
పంగులూరి గోవిందయ్య
అడ్వకేట్, ఒంగోలు
Reg.943/1987

మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఏ.నెం.319/2022
ఓ.యస్.నెం.15/2016

బిట్వీన్ :

అల్లూరి ఆంజనేయులు మరియు ఇతరులు ...పిటీషనర్లు

వర్సెస్

పర్చూరు చిన్నఅంజమ్మ మరియు ఇతరులు ....రెస్పాండెంట్లు

టు

ఆర్-6 :
అరవపల్లి పవన్ కుమార్, తండ్రి లేటు నరశింహారావు, హిందువు, వయస్సు 32 సం.లు, వ్యాపారం, నివాసం ఏ.యన్.ఆర్. క్లాత్ సెంటర్, కోర్టు బిల్డింగ్స్ ఎదురు, పర్చూరు.

ఆర్-7:
అరవపల్లి హరిత, తండ్రి లేటు నరశింహారావు, హిందువు, వయస్సు 30 సం.లు, గృహిణి, నివాసం ఏ.యన్.ఆర్. క్లాత్ సెంటర్, కోర్టు బిల్డింగ్స్ ఎదురు, పర్చూరు.

పై పిటీషన్‌లోని ఆర్-6 మరియు ఆర్-7, చనిపోయిన5వ రెస్పాండెంటు యొక్క (లేటు అరవపల్లి నరశింహారావు) వారసులుగా చేర్చమని పై నంబరు పిటీషను దాఖలు చేయగా ఆర్-6 మరియు ఆర్-7 గార్లకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను అందుకొనక కాలయాపన చేయుచున్నందున యిందుమూలముగా ది.31-03-2023న ఉదయం గం. 10.30 ని.లకు పై కోర్టు నందు మీరు స్వయముగా గానీ, వకీలు ద్వారాగానీ హాజరై తమ ఆక్షేపణలు తెలియచేసుకొన వలసినది. లేనియెడల మీ పరోక్షములో తీర్మానించ బడునని యిందుమూలముగా తెలియజేయటమైనది.

ఇట్లు
బి.యన్.మూర్తి,
అడ్వకేటు, చీరాల.
Cell:9346711020

ఉగాది లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : కలెక్టర్

సంతనూతలపాడురూరల్ : జగనన్న కాలనీ గృహాలను ఉగాది పండుగ నాటికి పూర్తి చేసి గహప్రవేశాలు చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. సంతనూతలపాడులోని జగనన్న కాలనీ గహా నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీగహాల త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు.

ప్రధానోపాధ్యాయురాలిపై ఆగ్రహం.

సంతనూతలపాడు వడ్డెరపాలెంలోని ఎలిమెంటరీ పాఠశాలను కలెక్టర్ దినేష్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలను అడిగారు.వారు సరిగ్గా సమాధానం చెప్పలేకపోవడంతో విద్యార్థులకు అర్ధమయ్యే విధంగా విద్యా బోధన అందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ జిల్లా కోఆర్డినేటర్ ఉషారాణి హౌసింగ్ పీడీ కె. చెన్నయ్య ఇన్‌ఛార్జి ఇఇ శ్రీనివాసప్రసాద్, జడ్‌పిటిసి రమణమ్మ. మాజీ ఎంపిపి చెంచిరెడ్డి, ఎంపిడిఒ రాఘవేంద్ర, తహశీల్దారు శ్రీనివాసరావు, పిఆర్ ఎఇ రవిబాబు, ఎంఇఒ సనత్ కుమార్ పాల్గొన్నారు.

వృద్ధురాలిపై అత్యాచారం

భయాందోళనలో చిన్నపిల్లల తల్లిదండ్రులు ● నిందితుడిని పోలీసులకు పట్టించిన స్థానికులు

ప్రజాశక్తి-చీరాల

కామంతో కళ్ళు మూసుకుపోయిన ఓ కసాయి తన కోరిక తీర్చాలంటూ అమ్మమ్మ వయసున్న ఓ పండు వృద్ధురాలిపై దాడి చేసి అత్యాచారం చేశాడు. స్థానికులు గమనించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల పట్టణం మరియమ్మ పేటకు చెందిన ఓ వృద్ధురాలిపై అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న దేవర వెంకటేష్ అలియాస్ (బండ) అనే యువకుడు శుక్రవారం అర్ధరాత్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. నిందితుడు వెంకటేష్ చెడు వ్యసనాలకు బానిసై గంజాయి తాగుతూ నిత్యం మత్తులో ఉంటూ గత కొంతకాలంగా గంజాయి విక్రయాలు జరుపుతూ యువతను తప్పుదోవ పట్టిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో వద్ధురాలు ఒంటరిగా నివసిస్తున్నట్లు గుర్తించి ఆమెపై ఘాతుకానికి ఒడిగట్టారని అన్నారు. వద్ధురాలు కేకలు



వేయడంతో గమనించిన స్థానికులు అక్కడికి వెళ్లేసరికి కామాంధుడు వెంకటేష్ అక్కడ నుంచి పరారయ్యాడు. వద్ధురాలు వివస్త్రగా ఉండటంతో మహిళలు దుస్తులు కప్పి చికిత్స నిమిత్తం ఉదయం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే నిందితుడు వెంకటేష్‌పై నిఘా వేసిన వార్డు స్థానికులు పొలాలలో కామాంధుడు ఒంటరిగా ఉన్నట్లు గుర్తించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ నిందితుడు వెంకటేష్ గతంలోనూ ఆ ప్రాంతంలో ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో దేహశుద్ధి చేశారన్నారు. వృద్ధురాలి పట్ల ఇంతటి దారుణానికి తలపెట్టడంతో చిన్నపిల్లలు తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఇలాంటి వ్యక్తి తమ ప్రాంతంలో ఉంటే తమ పిల్లలకు రక్షణ ఉండదని, తక్షణమే పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకొని కామాంధుడు వెంకటేష్‌ను తమ వార్డు నుంచి బహిష్కరించాలని ఏరియా వైద్యశాల వద్ద ఆ వార్డు ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేశారు. టూ టౌన్ పోలీసుల అదుపులో ఉన్న వెంకటేష్‌ను పోలీసులు కఠినంగా శిక్షించి తమ పిల్లలకు రక్షణ కల్పించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

రెండు ప్రాణాలను కాపాడిన ఆటోడ్రైవర్

- ఆత్మహత్య చేసుకోవాలనుకొని బయలుదేరిన విద్యార్థులు
- వన్ టౌన్ పోలీసులకు అప్పజెప్పిన ఆటోవాలా
- పల్నాడు జిల్లా నరసరావుపేట 9వ తరగతి విద్యార్థులుగా గుర్తింపు

ప్రజాశక్తి-చీరాల

బడికి వెళ్లకుండా ఇద్దరు విద్యార్థులు వాడరేవు వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని ఆటో ఎక్కి మాటలాడుకుంటున్న వారి మాటలు విన్న ఆటో డ్రైవర్ వారిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించి రక్షించాడు. వివరాల్లోకి వెళితే.. ఇంట్లో తల్లిదండ్రులు మందలించారనే కారణంతో బలవన్మరణానికి వాడరేవు వెళుతున్న ఇద్దరు మైనర్ బాలురను చాకచక్యంగా వ్యవహరించి ఆటో డ్రైవర్ పోలీసులకు అప్పగించాడు. ఈ సంఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. ఆటో డ్రైవర్, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఇద్దరు 9వ తరగతి బాలురు గురువారం మధ్యాహ్నం ఆటో ఎక్కి వాడరేవు వెళ్లాలని అడిగారు. వీరి వద్ద పుస్తకాలు ఉండటం, వీరి ప్రవర్తన అనుమానంగా ఉండటంతో ఆటో డ్రైవర్ యేసుబాబు వారిని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించాడు. విచారణలో వారు బలవన్మరణానికి వాడరేవు వెళుతున్నట్లు తేలింది. దీంతో సిఐ మల్లికార్జునరావు వారికి నచ్చచెప్పి వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. చాకచక్యంగా వ్యవహరించిన ఆటోడ్రైవర్ యేసుబాబును సిఐ ప్రత్యేకంగా అభినందించారు.



ఇంకొల్లు సాగర్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల దాడులు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లులోని సాగర్ ఎంటర్ ప్రైజెస్, పవన్ ఆగ్రో ఎంటర్ ప్రైజస్‌లో దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. సాగర్‌లో సరుకు నిల్వలకు, పుస్తకాలకు రూ.3.74 లక్షలు తేడా ఉండటంతో ఎరువులు సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశామని విజిలెన్స్ ఏఒ వాసంతి తెలిపారు. సాగర్ దుకాణానికి సంబంధించి రూ.5.18 లక్షలకు సంబంధించి అమ్మకాలు నిలుపుదల చేశామన్నారు. పవన్ దుకాణంలో రూ.5.52 లక్షలు తేడాలున్నాయన్నారు. ఈ దుకాణంపై కూడా 6ఏ కేసు నమోదు చేశామన్నారు. రూ.2.40 లక్షల విలువైన పురుగు మందులు నిలుపుదల చేసినట్లు సిఐ శ్రీహరిరావు వివరించారు. దాడుల్లో ఇంకొల్లు మండల వ్యవసాయాధికారి నార్నె వేణుగోపాల్, సిబ్బంది ఉన్నారు.

నేడు భట్టిప్రోలు లేవుట్ పరిశీలించనున్న జెసి

ప్రజాశక్తి-భట్టిప్రోలు: మండల కేంద్రం భట్టిప్రోలు జగనన్న కాలనీ లేవుట్‌ను బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పరిశీలించనున్నట్లు ఎంపిడి చంద్రశేఖర్ తెలిపారు. కాలనీలో సౌకర్యాలు వంటి పలు అంశాలను పరిశీలిస్తారని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ అధికారులు, వాలంటీర్లు తగిన రికార్డుతో హాజరు కావాలని సూచించారు.

రోస్టర్ వెరిఫికేషన్ ప్రక్రియకు వైకల్యం!

ఏడి కార్యాలయంలో మొక్కుబడిగా నిర్వహణ ● ఆందోళనలో వికలాంగ సంఘాల నాయకులు

ప్రజాశక్తి-వేటపాలెం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల రోస్టర్ వెరిఫికేషన్‌కు వైకల్యం సోకింది. కంచె చేను మేసిన చందంగా అండగా నిలబడాల్సిన ఏడి నిర్లక్ష్యం తమకు శాపంగా మారిందని వికలాంగులు వాపోతున్నారు. వికలాంగుల ఆర్తనాదాలను పరిగణలోకి తీసుకోకుండా మొక్కుబడిగా ఏడి కార్యాలయంలో వెరిఫికేషన్ సాగుతోంది. కలెక్టర్ రోస్టర్ వెరిఫికేషన్ గడువు పెంచి క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించినా ఏడి పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రతి సంవత్సరం మార్చి నాటికి వికలాంగుల చట్టం ప్రకారం స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. డ్రైవ్‌కు ముందు జిల్లాలో మొత్తం ఎన్ని ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. ఆ శాఖల్లో ఎంత మంది డిడిఒలు, హెచ్‌ఒడిలు ఉన్నారో తెలుసుకోవాలి. వారందరికీ జిల్లాలో వికలాంగుల ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయడానికి రోస్టర్ వెరిఫికేషన్‌కు కమిటీ ఏర్పాటు చేయాలి. కమిటీ ఛైర్మన్, కన్వీనర్, సభ్యుల సమక్షంలో రికార్డులు పరిశీలించి వివిధ కేటగిరీల వికలాంగ అభ్యర్థుల రోస్టర్ పాయింట్‌లను గుర్తించాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్ రోస్టర్ సైకిల్‌ను పాటించాలి. అంధులకు 6, బధిర, మూగకు 33,





రోస్టర్ వెరిఫికేషన్‌ను కార్యాలయంలో నిర్వహించడంపై ఏడి అర్చనను ప్రశ్నిస్తున్న కాలేషా, కార్యాలయ బోర్డు

శారీరక వైకల్యానికి 56, మానసిక వికలాంగులకు 86 నెంబర్లు కేటాయించాలి. వంద ఉద్యోగాల్లో నాలుగు ఖచ్చితంగా కేటాయించాలి. చట్టాన్ని అమలు పరచాల్సిన అధికారి ఏడి. ఏడి అర్చన ఈ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల జిల్లాలోని వికలాంగ సంఘాల నాయకులు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. చెంతనే ఉన్న గుంటూరు జిల్లాలో ఇటీవల నోటిఫికేషన్ వేస్తే 53 పోస్టులు వచ్చాయని అక్కడ అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను గుర్తించారని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర నాయకుడు షేక్ కాలేషా ప్రజాశక్తికి తెలిపారు. నిబంధనల ప్రకారం డిఆర్ఒ చాంబర్‌లో నిర్వహించాల్సిన వెరిఫికేషన్ ప్రక్రియ ఇలా మొక్కుబడిగా నిర్వహించడం వలన జిల్లాలోని నిరుద్యోగ వికలాంగులకు ఒనగూరేది ఏమీలేదని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జోక్యం చేసుకొని వికలాంగుల రోస్టర్ వెరిఫికేషన్ పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పలు వికలాంగ సంఘాల నాయకులు కోరుతున్నారు.



పట్టుబడిన రేషన్ బియ్యం

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-వేటపాలెం

జిల్లాలో రేషన్ అక్రమ రవాణా ఆగటం లేదు. సివిల్ సప్లయ్స్ అధికారులు వరుస దాడులు నిర్వహిస్తున్నా అక్రమార్కుల అరాచకం రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున రెండున్నర గంటల సమయంలో వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 175 బస్తాల రేషన్ బియ్యం మినీ వ్యాన్‌ను డిఎస్ఒ విలియమ్స్ ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డిఎస్ఒ విలియమ్స్ మాట్లాడుతూ పట్టుబడిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా గుర్తించామన్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని వాహనాన్ని సీజ్ చేశామన్నారు. డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు పరారయ్యారని పేర్కొన్నారు. త్వరలో నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి ఓంకారం, ఆర్ఐ సురేష్ పాల్గొన్నట్లు చెప్పారు.

జింక అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-పొదిలి

పట్టణంలోని పొదిలి-దర్శి రోడ్‌లోని రామ్ నగర్‌లో ఇళ్ల మధ్యలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో ఒక జింక మృతి చెందిన సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. జింక మృతి చెందిన విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ మల్లికార్జునరావు, సచివాలయం మహిళ పోలీస్ నాగలక్ష్మి తదితరులు స్థానికులను విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జింక మృతిపై అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

ఎద్దును చంపిన పెద్దపులి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల: పెద్దదోర్నాల మండలం కొర్రపోలు అటవీ శాఖ పరిధిలోని వై చెర్లోపల్లి బీట్ అటవీ ప్రాంతంలో వై చెర్లోపల్లి గ్రామానికి చెందిన పులుగుజ్జు దావీదుకు సంబంధించిన ఎద్దు కనిపించకుండా పోయింది. దానిని వెతకగా అటవీ ప్రాంతంలో చనిపోయి పడి ఉంది. దానిని పెద్దపులి చంపినట్లుగా గుర్తించి విషయాన్ని అటవీ శాఖాధికారులకు తెలిపారు. శుక్రవారం కొర్రపోలు ఫారెస్టు రేంజ్ అధికారి ప్రసన్నజ్యోతి ఎద్దును పులి చంపినట్లుగా గుర్తించి కేసు నమోదు చేశారు. బాధితునికి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని తెలిపారు.

గంజాయి విక్రేత పట్టివేత

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం: పిట్టలవానిపాలెం మండలంలో గుప్పుమంటున్న గంజాయికి ఛందోలు ఎస్ఐ రాజశేఖర్ తనదైన శైలిలో చెక్ పెట్టారు. ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం శుక్రవారం ఛందోలు గ్రామంలోని హబీబుల్లా వీధిలో గత కొంతకాలంగా గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా అమ్ముతున్నాడు. మత్తుకు బానిసలుగా మారుతున్న యువతను దృష్టిలో పెట్టుకొని ఎస్పి వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు నిఘా ఉంచారు. దీంతో ఛందోలు గ్రామానికి చెందిన షేక్ సమీవుల్లా అనే వ్యక్తి వద్ద నుంచి సుమారు అరకిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతనిపై ఛందోలు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి బాపట్ల కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ తెలిపారు.

మౌలాలి మృతి తీరనిలోటు

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త షేక్ మౌలాలి మృతి పట్ల టిడిపి బాపట్ల పార్లమెంటరీ అధ్యక్షులు ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మౌలాలి మృతి తెలుగు దేశం పార్టీకి తీరని లోటని అన్నారు.

బిల్లులు కావాలా? డబ్బులివ్వండి..

ట్రెజరీలో లంచాల కోసం అంగన్‌వాడీలపై ఒత్తిడి

ప్రజాశక్తి-పంగులూరు

'మీరు ఏమైనా చేసుకోండి. మీ బిల్లులు కావాలంటే ట్రెజరీలో కొంత ముట్టచెప్పాలి. అందుకోసం మీ బిల్లుల్లో 10 శాతం డబ్బును ఇవ్వాల్సిందే' అంటూ అంగన్‌వాడీలపై అధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు రకాలైన చిన్న చిన్న బిల్లులు పెట్టుకునే అవకాశం ఉంది. పిల్లల అన్నప్రాసన, సీమంతాలు, అక్షరాభ్యాసాలు, ప్రజారోగ్య కార్యక్రమాలు తదితర వాటిని కమ్యూనిటీ బెస్ట్ ఈవెంట్స్ (సిబిఇ) అంటారు. ఇవి ప్రతి నెలలో రెండు కార్యక్రమాలు తప్పనిసరిగా చేయాలి. ఈ కార్యక్రమాలు చేసినందుకు, ఒక్కో కార్యక్రమానికి 250 రూపాయలు ప్రభుత్వం ఇస్తుంది. నెలలో రెండు కార్యక్రమాలు చేయడం వలన 500 రూపాయలు వస్తాయి. ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రంలో పెట్టే భోజనంలో వాడిన కూరగాయలకు, విద్యార్థులకు ఒక్కొక్కరికి రోజుకు 1-50 పైసలు, బాలింతలు, గర్భిణులకు మూడు రూపాయల 70 పైసలు, ఇందుకు ఉపయోగించే గ్యాస్‌కు పిల్లలకు ఒక్కొక్కరికి 50 పైసలు, బాలింతలు, గర్భిణులకు 1-75 పైసలు చొప్పున ప్రభుత్వం ఇస్తుంది. ఇక ప్రభుత్వం చెప్పే పనులను సెల్ ఫోన్లో బాగా చేసిన అంగన్‌వాడీ టీచర్‌కు



నెలకు 500 రూపాయలు ఇస్తారు. ఇవి మొత్తం కలుపుకొని నెలకు సరాసరి 2,500 రూపాయల వరకు వస్తాయి. ఈ డబ్బులను నాలుగైదు నెలలకో, ఒక్కోసారి ఆరు నెలలకు కూడా ప్రభుత్వం ఇస్తుంది. ఈ డబ్బులను ట్రెజరీ ద్వారా బిల్లు చేయించాల్సి ఉంటుంది. అయితే ఈ బిల్లులు ట్రెజరీలో చేయించాలంటే అధికారులకు కొంత ముట్టచెప్పాలని, ఇందుకోసం వచ్చే బిల్లులో 10 శాతం డబ్బులను తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని అంగన్‌వాడీ టీచర్లపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ఈ డబ్బులు ఇవ్వకపోతే వీరిపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉందని కొంతమంది అంగన్‌వాడీలు 'ప్రజాశక్తి'కి తెలిపారు. కొరిశపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో కొరిశపాడు, పంగులూరు, అద్దంకి మండలాలు ఉన్నాయి. ఈ మూడు మండలాల పరిధిలో 202 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో ఒక్కో కేంద్రం నుంచి నెలకు 2,500 రూపాయలు బిల్లుకు పది పర్సెంట్ చొప్పున 250 రూపాయలు వస్తాయి. ఈ కేంద్రాలకు, నెలకు 50 వేల రూపాయలు పైగానే వసూలు అవుతాయి. అంటే ట్రెజరీ అధికారులకు ఇచ్చే డబ్బుల పేరుతో ప్రాజెక్టులో అధికారులు నెలకి 50 వేల రూపాయలు పైగా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి వసూలు చేస్తున్నారు. ఎవరైనా వీరికి ఎదురు తిరిగితే వారిని ఇబ్బందులకు గురి చేయటం వంటి పనులకు పాల్పడుతున్నారని కొంతమంది అంగన్‌వాడీలు తెలిపారు. పది శాతం వసూలు చేసేందుకు అక్కడక్కడా కొంతమంది ఏజెంట్లను కూడా ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది.

గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఇచ్చే గుడ్లు, పాలు, బియ్యం, పప్పులు, నూనె, ఇలా అనేక వాటిల్లో వాటాలు వసూలు చేసే అధికారులు, ఇప్పుడు నేరుగా అంగన్‌వాడీ టీచర్లకు వచ్చే బిల్లులోనే వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఇప్పటికైనా వారి కష్టాన్ని గుర్తించి పర్సంటేజీలు మానుకోవాలని పలువురు కోరుతున్నారు.

వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శిగా మస్తాన్‌వలి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్



వక్ఫ్ బోర్డు బాపట్ల జిల్లా కార్యదర్శిగా మార్టూరుకు చెందిన గడ్డం మస్తాన్‌వలి నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలోని రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయం నుంచి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాష్ట్రంలోని పలు జిల్లాలకు పది మంది సభ్యులతో కూడిన కమిటీలను నియమించారు. బాపట్ల జిల్లాకు సంబంధించి మార్టూరుకు చెందిన గడ్డం మస్తాన్‌వలిని కార్యదర్శిగా, మండల పరిధిలోని వలపర్లకు చెందిన షేక్ బీబీని సభ్యురాలిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. తమ నియామకాలకు సహకరించిన జిల్లా మంత్రి మెరుగు నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, రాష్ట్ర ప్రభుత్వ మార్కెటింగ్ కో ఆపరేటివ్ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్, రావి రామనాథంబాబులకు మస్తాన్‌వలి, బీబీలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తమకు అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. వీరు ఇరువురిని నియోజకవర్గంలోని వైసిపి నాయకులు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న షాడోస్ ప్రతినిధి రాజా సాల్మన్

మాదకద్రవ్యాల నుంచి పిల్లలను కాపాడాలి

ప్రజాశక్తి-చీరాల

పిల్లలు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని షాడో సంస్థ ప్రతినిధి రాజా సాల్మన్ అన్నారు. శుక్రవారం షాడోస్ మరియు నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ సత్యార్థి ఫౌండేషన్ కెవిఎస్‌ఎఫ్ సంయుక్తంగా ఆధ్వర్యంలో చీరాల రైల్వేస్టేషన్‌లో ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో బాలలపై మానవ అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై మాట్లాడారు. ఈ సందర్భంగా షాడోస్ సంస్థ ప్రతినిధి రాజా సాల్మన్ మాట్లాడుతూ వీధి బాలబాలికలు మాదకద్రవ్యాల దుర్వినియోగానికి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. పిల్లల తల్లిదండ్రులు మాదక ద్రవ్యాల దుర్వినియోగం ప్రమాదాన్ని గుర్తించాలని ఆల్కహాల్ దుర్వినియోగంతో పాటు పారిశ్రామిక జిగురు, వైట్నర్ వాడకం పిల్లలలో పెద్ద సమస్యగా ఉందని అన్నారు. ఈ మాదక ద్రవ్యాల వాడకాన్ని నియంత్రించి హాట్ స్పాట్ లను గుర్తించాలని, పిల్లలే దేశ భవిష్యత్తు కావున ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లి పిల్లలను ప్రతి ఒక్కరూ కాపాడాలని పిలుపునిచ్చారు. ఆర్పీఎఫ్ సీఐ ఎ శ్రీనివాసరావు మాట్లాడుతూ సురక్షిత బాల్యం, సురక్షిత భారత్ కావాలని అన్నారు. ఈ సమావేశంలో బి భాగ్యలక్ష్మి, పి తులసి, రైల్వే పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



చందలూరులో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

85 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-పంగులూరు: శంకర్ నేత్రాలయం, అంధత్వ నివారణ సంస్థ సహకారంతో, రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో, శుక్రవారం చందలూరు గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎల్లారెడ్డి వైద్య బృందం ఈ శిబిరాన్ని నిర్వహించింది. 85 మందికి కంటి పరీక్షలు చేయగా, అందులో 30 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు అధ్యక్షులు పెండ్యాల జగదీశ్వరరావు, రోటరీ బాధ్యులు చిలుకూరు వీరరాఘవయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



కోటంరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోటంరాజుకు నివాళి

ప్రజాశక్తి-బాపట్ల

జాతీయ పత్రికా రంగంలో తొలి జర్నలిస్టు సంఘాన్ని స్థాపించి తెలుగువారి సత్తా చాటిన కోటంరాజు రామారావు చిరస్మరణీయులని ప్రముఖ రచయిత్రి చిల్లర భవానీ దేవి అన్నారు. కోటంరాజు రామారావు 62వ వర్ధంతి సందర్భంగా ఫోరమ్ ఫర్ బెటర్ ఆధ్వర్యంలో పట్టణంలో పటేల్ నగర్ పోస్టాఫీసు వద్దగల కోటంరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ప్రజల్లో స్వాతంత్ర్య ఉద్యమ చైతన్యం రగిలించేందుకు ఆనాటి పత్రికల్లో రాసిన సంపాదకీయాలతో ఆంగ్లేయుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. ఆంగ్లేయుల ఆగ్రహానికి గురై జైలు శిక్ష అనుభవించారు. అక్షర సమరయోధ సంపాదకుడిగా ఖ్యాతికెక్కారు. ఎక్కడ రాజీపడని ధోరణితో, పాతిక పత్రికలలో పని చేశారు. జర్నలిస్టుల సంఘాన్ని స్థాపించి, వారి సంక్షేమం కోసం పాటుపడ్డారు. రాజ్యసభ సభ్యుడిగా, ప్రణాళికా సంఘం సలహాదారుగా దేశానికి విశిష్టమైన సేవలందించారు. కలం యోధుడు కోటంరాజు పటేల్ నగర్ బిల్డింగ్ సొసైటీలో సభ్యుడు కావడం విశేషం. కార్యక్రమంలో ఫోరమ్ కార్యదర్శి పిసి సాయిబాబు, ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డబ్ల్యుఏజికె మూర్తి, సొసైటీ కార్యదర్శి వెలగా శివరామయ్య, పటేల్ నగర్ పాఠశాల హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు, విశ్రాంత తహశీల్దారు విశ్వేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

భారత్ బచావో సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రేపల్లె

ఈ నెల 5వ తేదీన జరగనున్న భారత్ బచావో ఉమ్మడి గుంటూరు జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ప్రత్యూష సుబ్బారావు కోరారు. భారత రాజ్యాంగ పీఠికలోని మౌలిక అంశాలైన సర్వసత్తాక ప్రజాస్వామ్య లౌకిక సామ్యవాద గణతంత్ర భావాలకు భిన్నంగా మనువాద కార్పొరేట్ కాషాయ మతోన్మాద సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాల మేరకు రాజ్యాంగాన్ని మార్చి దాని స్థానంలో మనువాదాన్ని ప్రవేశ పెట్టాలని ప్రయత్నించటం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. ఫాసిజాన్ని ఓడిద్దాం, లౌకిక వాదాన్ని సాధిద్దాం అనే లక్ష్యంతో మతసామ రస్యం, రాజ్యాంగ పరిరక్షణ ప్రజాస్వామ్య పరిరక్షణ ధ్యేయంగా కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా అన్ని జిల్లాలలోనూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా భారత్ బచావో ఉమ్మడి గుంటూరు జిల్లా సదస్సును మార్చి 5వ తేదీన గుంటూరు నగరంలోని మలయలంక భవనంలో పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యవాదులు, ఉద్యమ కారులు, సామాజిక న్యాయం కోరే ప్రతి ఒక్కరూ కూడా సదస్సును జయప్రదం చేయాలని జిల్లా సెక్రెటరీ పాశం రామారావు పిలుపునిచ్చారు. భారత్ బచావో ఉమ్మడి గుంటూరు జిల్లా సదస్సు కన్వీనర్ కోలా నవజ్యోతి, తాటికొండ నరసింహారావు, జన విజ్ఞాన వేదిక నాయకులు లక్ష్మణరెడ్డి, బత్తుల కోటేశ్వరరావు డి సుధాకర్, ఏఐటియూసీ నాయకులు ఎం హనుమంతరావు, ఈమని అప్పారావు, చిట్టి, బీసీ మహాజన సభ ఉగ్గం సాంబశివరావు, పికేఎస్ నాయకులు పోతురాజు, నూర్‌బాషా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కె ఖాజావలి, పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి-సంతమాగులూరు

సామాన్య ప్రజల కోసం, నిరుద్యోగ యువత కోసం, వారి హక్కుల కోసం పోరాడే పిడిఎఫ్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులైన మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, పి బాబురెడ్డిని గెలిపించాలని, శుక్రవారం సంతమాగులూరులో ఉపాధ్యాయ సంఘాల నేతలు, ప్రజా సంఘాల నాయకులు ఓటర్లను కలుసుకొని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు జి విజయ్‌కుమార్ మాట్లాడుతూ, రాజకీయాలకతీతంగా పనిచేసే విజ్ఞానవంతులు, మేధావులు ఉండే ఈ సభలో పిడిఎఫ్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోతురాజు, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.





పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి-దర్శి

ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి దుగ్గిరెడ్డి బాబురెడ్డిని గెలిపించాలని విద్యాశాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ తాటిపర్తి గోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక విశాంత్ర ఉద్యోగ ఉపాధ్యాయుల సంఘం భవనంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత డిప్యూటీ కలెక్టరు పేరయ్య, జిల్లాపరిషత్ విశ్రాంత సిఇఒ శేషయ్య, జన విజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జయప్రకాష్ మాట్లాడారు. శాసనమండలిలో ప్రజల పక్షాన పోరాటం చేసే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్. వెంకటరెడ్డి, నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, ఎల్ఐసి ఎఒఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ రామకోటిరెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె. పిచ్చయ్య, మండల అధ్యక్షుడు కాలేబాష, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ధనిరెడ్డి వెంకటరెడ్డి, యుటిఎఫ్ నాయకులు మీనిగ శ్రీను, యలమందారెడ్డి, జెవివి నాయకుడు నాగరాజు పాల్గొన్నారు. **ఒంగోలు కలెక్టరేట్ :** ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థులు గెలిపించాలని ఒంగోలు నగర అభివద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు కోరారు. పిడిఎఫ్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం విస్తత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంక టేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడపా జనార్ధన్, శ్రీనివాస రెడ్డి, షేక్ మస్తాన్, మద్ది ఈశ్వర్ కుమార్. ఒంగోలు మురళీకష్ణ, లక్ష్మి పాల్గొన్నారు. **కంభం రూరల్ :** ప్రజల పక్షాన పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని యుటిఎఫ్, సిఐటియు నాయకులు కోరారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ పట్టణంలోని నేతాజీ నగర్‌లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపిస్తే శాసన మండలిలో ప్రజల గొంతుక వినిపిస్తారని తెలిపారు. పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి. బాబురెడ్డికి మొదటి ప్రాధ్యానత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కోలా సునీల్‌కుమార్, కె. చలమా రెడ్డి, ఆర్. నారాయణ, సిఐటియు నాయకులు తోట తిరుపతిరావు, ఎంఎస్.బేగ్ పాల్గొన్నారు. **పొదిలి :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని అభివద్ధి వేదిక జిల్లా అధ్యక్షుడు, విద్యాశాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ టి.గోపాల్ రెడ్డి కోరారు. స్థానిక పెన్షనర్ల భవనంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సిపిఎస్‌ను రద్దు చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలు కాలేదని తెలిపారు. జిల్లా అభివద్ధి, ప్రజా సమస్యలపై గళమెత్తే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ టి.పేరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలన్నారు. జిల్లా పరిషత్ విశ్రాంత డిప్యూటీ విద్యాధికారి ఎం.శేషయ్య మాట్లాడుతూ నూతన విద్యావిధానంతో విద్యారంగాన్ని ప్రభుత్వాలు సర్వనాశనం చేసాయన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జయప్రకాష్, పెన్షనర్స్ అసోసియేషన్ పొదిలి తాలుకా అధ్యక్షుడు ఎ.బాదుల్లా, డిప్యూటీ డివిజనల్ విద్యాధికారి బి.లక్ష్మయ్య, విశ్రాంత ఎంఇఒ కె.యలమందారెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, విశ్రాంత ఉపాధ్యాయులు చిట్టెంశెట్టి సుబ్బారావు, మూసాజాని, విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకుడు పి.రామారావు, విశ్రాంత ఎఎస్ఐ సుబ్బారావు, ఎఐటియుసి పొదిలి మండల కార్యదర్శి కె.వి.రత్నం, ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగులు పమిడి వెంకటేశ్వర్లు, పి.చార్లెస్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.చిన్నపరెడ్డి పాల్గొన్నారు. **టంగుటూరు :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపిస్తేనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేశపోగు మోజెస్ తెలిపారు. స్థానిక పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ పలువురు నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోజెస్ మాట్లాడుతూ ప్రజాసంఘాలు బలపరిచే తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఇరువురి మహేశ్వరరావు, కొల్లాబత్తిన శ్రీనివాస్, మల్లాల యానాది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యాశాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ గోపాల్ రెడ్డి



ఒంగోలులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : డిఇఒ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని డిఇఒ పి. రమేష్ తెలిపారు. అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పాటీల్లో రన్నర్స్‌గా నిలిచిన భూపతిపల్లి, గజ్జలకొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ పి.రమేష్ మాట్లాడుతూ క్రీడాల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పాటీల్లో ప్రతిభ చూపి విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకోనిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బి.రాందాస్‌నాయక్, ఉపాధ్యాయులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మించాలి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగరంలోని సుజాతనగర్ -అంజయ్యరోడ్డు మధ్య అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా మధు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ నిర్మాణంతో సుజాతనగర్-అంజయ్యరోడ్డు మధ్య రాకపోకల లింకు తెగిపోయినట్లు తెలిపారు. పర్యావసానంగా ఫ్లైఓవర్‌కు అవతలవైపుగా ఉన్న సుజాతనగర్, పోలీసు క్వార్టర్స్, ఇతర కాలనీల ప్రజలు నగరంలోకి రావాలంటే చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సుజాతనగర్ -అంజయ్యరోడ్డు మధ్య అండర్‌పాస్ ఏర్పాటు చేయగలిగితే ఆప్రాంత ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ సమస్య కూడా పరిష్కారం అవుతోందని తెలిపారు. అండర్ పాస్ నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

సిపిఎం మండల నాయకుడు

పట్టపు ప్రకాశంకు సతీవియోగం

ప్రజాశక్తి- కొత్తపట్నం

సిపిఎం మండల నాయకుడు పట్టపు ప్రకాశంకు సతీ వియోగం కలిగింది. ఆయన సతీమణి పట్టపు శకుంతల శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు సంతాపం తెలిపారు.నివాళు లర్పించిన వారిలో సిపిఎం జిల్లా నాయకులు షేక్ మాబు, కంకణాల ఆంజనేయులు, కాలం సుబ్బారావు, పమిడి వెంకటరావు, హనుమంతరావు, బాలకోటయ్య ,కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాలాద్రి, జిల్లా కార్యదర్శి బి. రఘురాం, రాఘవులు ,మోజెస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు ,ఐద్వా జిల్లా నాయకులు కంకణాల రమాదేవి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు, సిపిఎం కొత్తపట్నం మండల కార్యదర్శి సోమిరెడ్డి, పిల్లి కృష్ణ తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

పన్ను బకాయిదారులకు నోటీసులు : కమిషనర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

కార్పొరేషన్‌కు అధిక మొత్తంలో ఆస్తిపన్ను, నీటి పన్ను బకాయిలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయాలని, మొండి బకాయి దారులకు నీటి కులాయి కనెక్షన్లు తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. నాలుగో డివిజన్ ఇస్లాంపేట సచివాయం పరిధిలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. దీర్ఘకాలికంగా నీటి పన్ను బకాయి ఉన్నవారికి నోటీసులు ఇచ్చి కులాయి కనెక్షన్లు తొలగించాలని సూచించారు. ప్రతి రోజు, ప్రతి ఇంటి నుంచి మూడు బుట్టల ద్వారా చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్ తప్పని సరిగా చేయాలని, కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాలుగో డివిజన్ కార్పొరేటర్ నూర్జహాన్ జాకీర్, కార్పొరేషన్ ఇంజినీర్ మాల్యాద్రి, అసిస్టెంట్ సిటీప్లానర్ వెంకటేశ్వర్లు, డిఇఇ రఘురాం, శానిటరీ సూపర్ వైజర్ పిచ్చయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మిరియాల శ్రీను, శ్రీనాథ్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్



మాట్లాడుతునన జేఏసీ అమవరాతి చెర్మన్ బొప్పరాజు

9 నుంచి ఉద్యమ కార్యాచరణ

జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9నుంచి ఉద్యమ కార్యాచరణ ప్రారంభిస్తున్నట్లు ఎపిఆర్ఎస్ఎ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ఎపిఆర్ఎస్ఎ భవన్ శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి చాల బాధకం మైనదన్నారు. ప్రభుత్వం ప్రతి నెలా సమయానికి జీతాలు, పెన్షన్లు ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు దామోదర్, మల్లేశ్వరరావు, సిహెచ్.రవి, జిల్లా నాయకులు ఆర్‌విఎస్.కృష్ణమోహన్, డానియేల్, ప్రసన్న, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, ఇసాక్, వెంకటేవ్వరరెడ్డి పాల్గొన్నారు.

7న మహిళలకు సన్మానం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 7న ఉదయం 11 గంటల నుంచి హౌసింగ్ బోర్డు కాలనీలోని మహిళాభ్యుదయ సమితి కార్యాలయ ఆవరణలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో రాణి స్తున్న ఐదుగురు మహిళలకు సన్మానం, పురస్కారాలు అంద జేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా న్యాయసేవా విభాగం జిల్లా కార్యదర్శి శ్యామ్‌బాబు, గౌరవ అతిథులుగా స్త్రీ శిశు, సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ధనలక్ష్మి , లయన్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ప్రకాష్ చావల, డాక్టర్ చాపల శాంతకుమారి, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు నాగభైరవ ఆదినారాయణ, కళామిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు పాల్గొంటారని తెలిపారు.

'పేస్'లో టెక్నికల్ ఫెస్ట్

ప్రజాశక్తి -టంగుటూరు

స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో సజన 2 కే 23 టెక్నికల్ ఫెస్ట్ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ టెక్నికల్ ఫెస్ట్ వేడుకలు విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు దోహదపడతాయని తెలిపారు. టెక్నికల్ ఫెస్ట్ వేడుకలకు వివిధ కళాశాలకు 1,200 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. అనంతరం ఫెస్టు వేడుకల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మూర్తి, ఎఒ రమణబాబు, ప్లేస్ మెంట్స్, శిక్షణ డీన్ రూప, స్టూడెంట్స్ డీన్ వీరాంజనేయులు, టెక్నికల్ ఫెస్ట్ కన్వీనర్ ఎం.కోటేశ్వరరావు, కో కన్వీనర్ శేషగిరిరావు, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - మద్దిపాడు పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్‌విఎస్ అకాడమీ ఆధ్వర్యంలో శు క్రవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. మాజీ ఎమ్మెల్యే బిఎన్. విజయకుమార్ చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు ఎడ్యుకేషనల్ కల్చరల్ అసోషియేషన్ సంస్థ చైర్మన్ కొణిజెటి శివకుమార్, టిడిపి మండల అధ్యక్షుడు ఎం. జయంత్ బాబు, గ్రామ అధ్యక్షుడు రఘు బాబు. వి. శ్రీనివాసరావు ప్రభాకర్ రావు. చింతల శ్రీను ఎస్. అనిల్, పి. సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పరామర్శ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

అస్వస్థతకు గురై ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు పొందుతున్న పెద్దదోర్నాల లోని ఏకలవ్య బాలికల మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులను టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు శుక్రవారం పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి విద్యార్థినులకు అందిస్తున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డి, మాబు, ఇస్మాయిల్, బాషా, శేషాద్రి, సుబ్బరత్నం పాల్గొన్నారు.

మెడికల్ కిట్లు అందజేత

శింగరాయకొండ : శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా డిఎల్‌టిఒ (జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ ఆఫీసర్) డాక్టర్ సురేష్ కుమార్ చేతుల మీదుగా క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రధానమంత్రి టీబీ ముక్తి భారత్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా పౌష్టికాహార ఫుడ్ బాస్కెట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారముతో పాటుగా ఆరు నెలల పాటు మందులను వినియోగిస్తే వ్యాధి నయం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉజ్వల ,డాక్టర్ శ్రీకాంత్ , సిహెచ్ఒ సోమేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ , రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి- జరుగుమల్లి

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 83వ నంబరు పోలింగ్ కేంద్రాన్ని స్థానిక తహశీల్దారు నయీమ్ అహమ్మద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలోని సౌకర్యాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్త హేమలతకు ఓటరు స్లిప్‌లు అందజేశారు. అనంతరం విద్యార్థులకు సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. విద్యార్థులకు తానే స్వయంగా భోజనం వడ్డించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. శ్రీనివాసరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, కె. నరసింహారావు,నవిఆర్ఒ లక్ష్మి, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శింగరాయకొండ : ఎమ్మెల్సీ ఎన్నికల కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దారు ఉష శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పోలింగ్ కేంద్రంలోని వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తన్నీరు తిరుమలరావు, రెవెన్యూ సిబ్బంది నవీన్, అశోక్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

కనిగిరి : కనిగిరి పట్టణంలోని కేటిఆర్ టెక్స్‌టైల్స్ ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. కేటిఆర్ టెక్స్‌టైల్స్ అధినేత కుందురు తిరుపతిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి,కదిరి బాబూరావు,రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఎంపిపి దంతులూరి ప్రకాశం తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

ఉగాది లోపు జగన్న గృహాల పూర్తిచేసి గృహప్రవేశాలు జరపాలని మండలప్రత్యేకాధికారి అంజుల తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, విఆర్ఒలు కార్యదర్శులు, తహశీల్దారు, ఎంపిడిఒతో గృహ నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు అశోక్ కుమార్ రెడ్డి, ఎంపిడిఒ కుమారి, హౌసింగ్ ఇన్‌ఛార్జి ఎఇ హేమలత, ఎపిఎం రవికుమార్ , విఆఒలు కార్యదర్శులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపిటిసి నాగయ్య మృతి

ప్రజాశక్తి-టంగుటూరు



దామచర్ల నాగయ్య (ఫైల్)

టంగుటూరు మండలం మల్లవరప్పాడు గ్రామ ఎంపిటిసి దామచర్ల నాగయ్య (39) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. తూర్పు నాయుడుపాలెం గ్రామానికి చెందిన నాగయ్య పొలం వెళ్లి పంటను పొగాకు ఇంటికి వచ్చాడు. తనకు ఆయాసంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. అనంతరం హఠాత్తుగా పడిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే నాగయ్య మతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగయ్యకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. నాగయ్య మృతి గురించి సమాచారం తెలుసుకున్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు, గ్రామ నాయకులు దామచర్ల అనిల్, దామచర్ల వెంకటేశ్వరరావు తదితరులు నాగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. తూర్పు నాయుడు పాలెంలో ఆదివారం నాగయ్యకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని హౌస్ అరెస్ట్ చేయాలి

సబ్‌కలెక్టర్ సేతు మాధవన్‌కు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి-మార్కాపురం



సబ్ కలెక్టర్ మాధవన్‌కు సిపిఎం నేతల వినతి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిబంధనలు పాటించకుండా అధికార దర్పంతో బెదిరింపులకు పాల్పడుతున్న మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డిని హౌస్ అరెస్ట్ చేయాలని కోరుతూ మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌కు సిపిఎం సీనియర్ నాయకులు గాలి వెంకటరామిరెడ్డి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ప్రతి స్కూల్‌కు, ప్రతి కాన్వెంట్‌కు టైం షెడ్యూలుతో వెళుతున్నారన్నారు. అక్కడే భోజనాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడమే కాకుండా... మాటలతో బెదిరిస్తున్నారని ఆరోపించారు. మార్కాపురంతో పాటు గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లోనూ అక్కడి ప్రజా ప్రతినిధులపై ఎన్నికల కమిషన్ నిఘా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు అందజేసిన వారిలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య, సిపిఎం నాయకులు డికెఎం. రఫి, కె.డేవిడ్ తదితరులు ఉన్నారు.

సబ్‌కలెక్టర్‌కు బాధితుల వినతి

ప్రజాశక్తి-మార్కాపురం



మాట్లాడుతున్న బాధితులు

మండల పరిధిలోని పెద్ద నాగులవరం గ్రామ సర్వే నెంబర్ 206లో పేదలకు పట్టాలు ఇచ్చిన స్థలాలను ఆ గ్రామానికి చెందిన ఒర్సు తిరుపతయ్య , ఆయన నలుగురు కుమారులు ఆక్రమించుకునే ప్రయత్నంలో ఉన్నారని ఆ స్థలాల్లో పట్టాలు పొందిన పలువురు ఆరోపించారు. మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌కు ఈ మేరకు శుక్రవారం వినతిపత్రం అందించారు. వివరాల ప్రకారం... పెద్ద నాగుల వరం గ్రామంలో 1985లో సొంత ఇల్లు లేని పేదలకు సర్వే నెంబరు 206లో కొంత భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసింది. పట్టాలు ఇవ్వగా 30 సెంట్ల స్థలం ఖాళీగా ఉంది. అదే గ్రామంలో మరి కొందరు నివాసం లేదని అర్జీలు పెట్టుకోగా 15 మందికి ఒక్కొక్కరికి రెండు సెంట్ల భూమిని కేటాయించారు. పట్టాలు కూడా మంజూరు చేశారు. ఆ పట్టాలు పొందిన వారంతా జగనన్న కాలనీ కోసం అర్జీలు పెట్టుకోగా మంజూరు చేశారు. ఈ తరుణంలో ఆ గ్రామానికి చెందిన ఒర్సు తిరుపతయ్య కుటుంబీకులు ఆ స్థలంలోకి దిగకుండా అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, డి.సోమయ్య, డికెఎం.రఫి, ఒర్సు అడివయ్య పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

ప్రజాశక్తి -శింగరాయకొండ



బాలిక తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు

శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలాజీ నగర్‌లో ఈనెల 5న బాల్య వివాహం నిర్వహిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో స్పందించిన ఎస్ఐ ఫిరోజా పాతిమా, డిప్యూటీ తహశీల్దార్ తన్నీరు వెంకటేశ్వర్లు, ఉలవపాడు సిడిపిఒ విజయలక్ష్మి బాలాజీ నగర్ వెళ్లి బాలిక తల్లితండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలుపుదల చేశారు. బాలాజీ నగర్ చెందిన నిమ్మకాయల మాల్యాద్రి కుమార్తె 8వ తరగతి చదువుతోంది. వలేటివారిపాలెం మండలం లింగన్నపాలెంకి చెందిన ఓ వ్యక్తితో ఆ బాలికకు వివాహం చేసేందుకు నిర్ణయించారు. ఈ విషయం గురించి తెలుసుకున్న అధికారులు బాలాజీ నగర్ వెళ్లి బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే కష్ట నష్టాలు, శిక్షల గురించి వివరించారు. అనంతరం వివాహం చేయమని బాలిక తల్లిదండ్రుల నుంచి సంతకాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ సింహాద్రి, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్, లింగం, అంగన్‌వాడీ సూపర్వైజర్ నాగలక్ష్మి , మహిళా కానిస్టేబుల్ భారతి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ

ప్రజాశక్తి -దొనకొండ

పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని ఎఒ ఎన్. లక్ష్మీనారాయణ తెలిపారు. దొనకొండలోని చిన్ని కృష్ణ ఎరువుల దుకాణంలో శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులకు నాసి రకం ఎరువులు, పురుగు మందులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి- దొనకొండ

మండల పరిధిలోని మంగినపూడి గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. డిపిఒ నారాయణరెడ్డి ప్రత్యేక పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలను పరిశీలించారు.ఉగాది నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ అభివృద్ధికి ప్రధాన ఆదాయవనరు అయిన ఇంటి పన్నులను నూరు శాతం వసూలు చేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రాచగొర్ల మహేష్, ఎంపిడిఒ వసంతరావునాయక్, ఇఒపిఆర్‌డి ఎస్.డేవిడ్, కార్యదర్శులు శేషమ్మ, శ్రీనివాసులు, నాగార్జున పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పరిశీలన

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలం ఉమ్మన్నపల్లి గ్రామ పంచాయతీలో నిర్మిస్తున్న గృహాలను ఎంపిడిఒ జివి. కష్ణారావు శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేసుకోవాలని కోరారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి వలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.**జరుగుమల్లి :** మండల పరిధిలోని నందనవనం గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్లలో నిర్మిస్తున్న గృహాలను మండల ప్రత్యేక అధికారి గ్రంధి మాధవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని జగనన్న పాల వెల్లువ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పాల సేకరణ పెరగాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ .పి.రామకృష్ణ, సచివాలయ కార్యదర్శి టి.శ్రీనివాసులు, ఎపిఒ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి- జరుగుమల్లి



నీళ్ల డమ్ములను పరిశీలిస్తున్న అధికారులు

మండల పరిధిలోని తూమాడు గ్రామంలో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జ్ఞానశ్రీ పలు వీధుల్లో పర్యటించారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జర్వాల రాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ జ్ఞానశ్రీ మాట్లాడుతూ గ్రామంలోని మురుగునీటి కాలువలను శుభ్రం చేయించాలని గ్రామ సచివాలయ కార్యదర్శికి సూచించారు. దోమల నివారణకు ఎబెటే ద్రావణాన్ని పిచికారీ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి చందు సాగర్, సచివాలయ కార్యదర్శి డి.మౌనిక, సిహెచ్ఒ పి.వెంకటేశ్వరరావు, సురేష్, శ్రావణి, అనూషా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మేథో మథనంతో అభివృద్ధికి శ్రీకారం

విశాఖ స్టీల్ ప్లాంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సింగిశెట్టి గురునాథరావు ● బాపట్ల బిఈసిలో అట్టహాసంగా ప్రారంభమైన బెక్టగాన్

ప్రజాశక్తి-బాపట్ల

మారుతున్న సాంకేతిక పరిజ్ఞాన మేధో మథనంతో ప్రపంచానికి అవసరమైన బృహత్తరమైన అభివృద్ధికి శ్రీకారం చుట్టొచ్చని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సింగిశెట్టి గురునాథరావు అన్నారు. శుక్రవారం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో అట్టహాసంగా ప్రారంభమైన రెండ్రోజుల పాటు మెకానికల్ విభాగంలో జరిగే రెండో అంతర్జాతీయ సదస్సు (బెక్టగాన్- 2023)కు సింగిశెట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విలక్షణ సాంకేతిక విద్యా కేంద్రంగా వినుతికెక్కిన బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బెక్టగాన్ ఉత్సవాలు నిర్వహించడం సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతుందని అన్నారు. సాంకేతిక విప్లవంతోనే అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లోని పదునైన మేధస్సుకు బాపట్లలో నిర్వహించే బెక్టగాన్- 2003 ఒక చక్కని వేదిక అన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్ రంగంలో నూతన సాంకేతికను అందిపుచ్చుకోవడానికి ఇలాంటి సదస్సులు విద్యార్థులకు, అధ్యాపకులకు, పరిశోధకులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అనేక సంస్థల నుంచి వివిధ అంశాలపై 80కి పైగా పరిశోధన పత్రాలు ఈ సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి యేడు నిర్వహించే ఈ సదస్సు ద్వారా ప్రపంచ నలుమూలల నుంచి అనేక పరిశోధనాంశాలు ఒకే వేదికపై చర్చించడం ద్వారా సాంకేతిక అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ షేక్ నజీర్ మాట్లాడుతూ 60కి పైగా సాంకేతిక, సాంస్కృతిక, సాహిత్య, క్రీడా విభాగాల పోటీల్లో జాతీయ స్థాయిలో పాల్గొంటున్నాయన్నారు. 7 వందల మంది వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామమోహనరావు, గెల్లి దిలీప్, టిసిఎస్ సంస్థ డిజైన్ ఇంజినీర్లు ఈఎస్ చక్రవర్తి, రమేష్, మెకానికల్ విభాగాధిపతి టి నాంచార్య, కోఆర్డినేటర్లు జె లక్ష్మీ లలిత, ఏ ప్రవీణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గురునాథంరావు

బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని భట్టిప్రోలు గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి పేర్కొన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలలో కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం క్రమం తప్పకుండా ఇవ్వాలని అన్నారు. బరువు తక్కువ పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రవికిరణ్మయి

ఇంకొల్లు రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పావులూరు సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్ వాణి పేర్కొన్నారు. ఇంకొల్లు మండలంలోని పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయటం వల్ల జరిగే నష్టాలను గురించి వివరించారు. కిశోర బాలికలకు తీసుకోవాల్సిన పౌష్టికాహారాన్ని గురించి విపులంగా వివరించారు. రక్తహీనత లేకుండా చూసుకోవాలని వాణి సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సిహెచ్ గిరిజారాణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


పావులూరులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ వాణి

ఉగాదికి ఇంటి నిర్మాణాలు పూర్తి కావాలి

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఇంటి నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేసి లబ్ధిదారులు గృహప్రవేశం చేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి అబ్దుల్ సత్తార్ అన్నారు. స్థానిక కొత్తపేట పంచాయతీ ఆవరణంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు అధ్యక్షతన జగనన్న ఇళ్ల లబ్ధిదారులు మరియు పలు శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ రాజ దెబోర, ఎంపీడీవో ఎంవిఎస్ శర్మ పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న ఇంటిలో లబ్ధిదారులందరూ ఉగాదికి గృహప్రవేశం చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఆ దిశగా అధికారులు కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకొని జగనన్న ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు సకాలంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో గృహప్రవేశం చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. సమావేశానికి హాజరైన మాజీ సర్పంచ్ చుండూరు వాసు మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి కరోనా వంటి విపత్కర సమయాలలో కూడా పారిశుధ్య కార్మికులు, వాలంటీర్లు ఎంతగానో సేవలు అందించారని అన్నారు. వాలంటీర్ల సేవల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పంచాయతీ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేసే వాలంటీర్లను ఎంపిక చేసి తన సొంత ఖర్చుతో వాలంటీర్లకు ఇళ్ల స్థలాల ఏర్పాట్లను స్వచ్ఛందంగా చేయనున్నట్లు ప్రకటించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చాటే వాలంటీర్లను ఎంపిక చేసి ఇళ్ల స్థలాలను అందిస్తామని అధికారుల సమక్షంలో ఆయన హామీ ఇచ్చారు. కొత్తపేట పంచాయతీ అభివృద్ధికి అధికారులు, సచివాలయ సిబ్బంది అందరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ చుండూరు వాసు

రైతు సేవలో 'వెల్లలచెరువు' ముందడుగు

ప్రజాశక్తి-సంతమాగులూరు: రైతులకు సేవ చేయడంలో ముందడుగు వేసిన వెల్లలచెరువు ఫాక్స్ పాలకవర్గానికి అభినందనలు తెలియజేస్తున్నట్లు జిల్లా ఫాక్స్ డెవెలప్‌మెంట్ మేనేజర్ టిపివి నరసింహారావు అన్నారు. మండలంలోని వెల్లలచెరువు సొసైటీ బ్యాంక్ ఆవరణలో, రైతులు గిడ్డంగుల్లో దాచుకున్న పంటలకు ఎన్ఇఆర్ఎల్ వారి సహకారంతో, వెల్లలచెరువు పాక్స్ వారు ఎలక్ట్రానిక్ నేగోషియబుల్ వేర్‌హౌస్ రసీదును జారీ చేయడంతో, రైతు చీతిరాల రామయ్యకు అందజేశారు. చీతిరాల రామయ్య తాను తాకట్టు పెట్టుకున్న పంటకు గాను, రసీదును అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా రాఘవయ్య మాట్లాడుతూ, వెల్లలచెరువు పాక్స్ యొక్క 1,700 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గౌడన్ అన్నారు. ఈ గౌడన్‌కు వేర్ హౌసింగ్ డెవలప్‌మెంట్ మరియు రెగ్యులేటర్ అథారిటీ వారి చేత గుర్తింపు పొందిందన్నారు. దీనివల్ల రైతులు ఇన్సూరెన్స్‌తో కూడిన ప్రమాణికరణించదగిన గిడ్డింగ్ సదుపాయాలు పొందే వీలు కలుగుతుందన్నారు. అలాగే రైతులకు మరింత ప్రయోజనం చేకూరే విధంగా గౌడన్‌లో దాచుకున్న పంటలకు ఎన్ఇఆర్ఎల్ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వెల్లలచెరువు పాక్స్ ప్రెసిడెంట్ చింతా శ్రీధర్‌బాబు, సీఈవో ఆంజనేయులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: ఏప్రిల్ 29న జరగబోయే నవోదయ ప్రవేశ పరీక్షకు మండలంలోని గంగవరం గ్రామంలో ఉచిత శిక్షణ ప్రారంభించారు. శ్రీ మంచాల రంగమ్మ వెంకటరామయ్య విజ్ఞాన కళ్యాణ మండపంలో ప్రతి రోజు సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రారంభ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఆత్మకూరి సుబ్బారావు, జయరాణి, నలతోటి భాను, వై సిద్దయ్య, సమర్పణరావు తదితరులు పాల్గొన్నారు. శిక్షణకు డాక్టర్ మంచాల రమేష్ ఆర్థిక సాయం అందిస్తున్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: తాటిపర్తివారిపాలెం ఎడ్యుకేటర్స్ గ్రూపు వారు రూ.10 వేల విలువైన నవోదయ ప్రవేశ పరీక్షకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఇంకొల్లు మండలంలోని గంగవరం, తాటిపర్తివారిపాలెం, నలతోటివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు అందచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంది సమర్పణరావు, ఆత్మకూరి సుబ్బారావు, చెక్కా గోపివర్మ, కట్టా సురేష్, కె శ్రీనివాసరావు, రామారావు, ప్రమీలారాణి, వీరాంజనేయులు, సంజీవరెడ్డి, శ్రీలక్ష్మి, సువర్చలారాణి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

ప్రజాశక్తి-జరుగుమల్లి: బతుకు దెరువు కోసం రైతు పొలం పనులకు వెళ్లిన సమయంలో కుక్కల దాడిలో 17 గొర్రె పిల్లలు మృతి చెందాయి. ఈ సంఘటన జరుగుమల్లి మండలంలోని కె.బిట్రగుంట గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన నిమ్మకాయల మోహనరావు శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్లగా, ఉదయం కుక్కలు ఆయన గొర్రెపిలల్లపై దాడి చేసి చంపాయి. దీంతో తనకు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు వాపోయారు.

కత్తిపోటుకు గురైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రేపల్లె: మండలంలో యువకుడి హత్య కలకలం సృష్టించింది. రేపల్లె మండలం రుద్రవరం గ్రామానికి చెందిన దాసరి రాజేష్ అనే యువకుడు 01.03.23న పుట్టిన రోజు పార్టీలో ఉండగా పాత గొడవలు మనసులో పెట్టుకున్న బొట్టు కన్నా అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన బాతాటి శౌర్యబాబు (తండ్రి జోసఫ్)(30) మీద చాకుతో విచక్షణారహితంగా పొడవడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. అడ్డువచ్చిన యోగేష్ అనే అతనికి కూడా గాయాలవటంతో గుంటూరు జిజిహెచ్‌కి తరలించారు. తీవ్ర గాయాల పాలైన శౌర్యబాబు చికిత్స పొందుతూ మృతి చెందాడు. యోగేష్‌కు ప్రాణాపాయం తప్పిందని సీఐ విజయచంద్ర తెలిపారు. సదరు కేసుపై ముందుగా సెక్షన్ 307 ఐపీసీ కేసు నమోదు చేసి తదుపరి మర్డర్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రేపల్లె పోలీస్ స్టేషన్ సీఐ విజయచంద్ర తెలిపారు.

ఫ్లోరోసిస్ పరీక్షలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల పరిధిలోని కొరప్రోలు, చింతల ప్రాథమిక వైద్య కేంద్ర పరిధిలోని పలు గ్రామాలలో జిల్లా ఫ్లోరోసిస్ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ శుక్రవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో ఫ్లోరిన్ సమస్య ఉన్నటఉల తెలిపారు. సమస్యను జిల్లా అధికారి డాక్టర్ భగీరథీదేవి, రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్ దష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. తొలుత మోడల్ స్కూల్ మల్లికార్జునపురం, గవర్నమెంట్ ఆశ్రమ ట్రైబల్ హై స్కూల్, చింతల విద్యార్థులను పరీక్షించారు. విద్యార్థులు శుద్ధమైన నీరు, విటమిన్, కాల్షియం కలిగిన ఆహారం తీసుకోవం ద్వారా ఎముకలకు సంబంధించిన ఫ్లోర్‌సిస్ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకర్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ యాగ్నిక్, డాక్టర్ సాయి ప్రశాంతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజేష్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పొదిలి: షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడికి పొదిలి యువకులు శుక్రవారం ఆర్థిక సహాయం అందించారు. గుంటూరు శనివారం నిర్వహిస్తున్న జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొనేందుకు వెళ్తున్న ఏ.నాగేంద్ర కుమార్‌కు రూ.5వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేషా, రబ్బానీ, రాజేష్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలం సమావేశం ఎంపిపి నలమలపు అంజమ్మ అధ్యక్షతన శుక్రవారం సాదాసీదాగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొన్ని అంశాలపై సమీక్షించినట్లు తెలిపారు. ఎలాంటి తీర్మానాలు చేయకుండానే సభను ముగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కుమారి, జడ్‌పిటిసి యాదల రత్నభారతి, మండల ప్రత్యేకాధికారి అంజుల, ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మడనూరులో పొలంబడి

ప్రజాశక్తి- కొత్తపట్నం

మండల పరిధిలోని మడనూరు గ్రామంలో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచరల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ నరసింహులు ఆధ్వర్యంలో వేరుశనగ పంటపై పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేరుశనగ పంటకు కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, పివి ఝాన్సీరాణి, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ శ్రీనివాసులు, అనిల్ , రెడ్డప్ప, శిరీష, వెంకటేశ్వరరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అదనపు పంటపై జరిమానా వద్దు

ప్రజాశక్తి మద్దిపాడు

పొగాకు అదనపు పంటపై జరిమానా రద్దు చేయాలని బోర్డు మెంబెర్ మరెడ్డి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో రద్దు చేసిన మాదిరిగా ఇక్కడ అదనపు పొగాకు పంటపై జరిమానా రద్దు చేయాలన్నారు. వేలం కేంద్రానికి 382 పొగాకు బేళ్లు అమ్మకానికి రాగా 330 బేళ్లు అమ్ముపోయాయి. వివిధ కారణాలతో 52 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ. 190, సరాసరి ధర రూ. 196-95పైసలు పలికినట్లు వేలం నిర్వాహణాధికారి శ్రీనివాస్ తెలిపారు.

మెరుగైన చికిత్స అందించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: దోర్నాల ఏకలవ్య పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన రోజు నుంచి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధికారులతో మాట్లాడి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు. ఇప్పటికే నీటిని పరీక్షల నిమిత్తం పంపటంతో ఫలితాలు త్వరగా తెప్పించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

5న రెగ్యులర్ మెడికల్ క్యాంపు


ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో బిపి, షుగర్, ఫిట్స్, పక్షవాతం రోగులకు నిర్వహించే రెగ్యులర్ మెడికల్ ఈ నెల 5వ తేదీన ఉదయం ఐదు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతుందని మెడికల్ క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు తెలియజేశారు. వైద్యం వ్యాపారమై నిరుపేదలకు దూరమైన నేపథ్యంలో గత ఎనిమిది సంవత్సరాలుగా క్రమం తప్పకుండా రెండు నెలలకు ఒకసారి ఒంగోలులో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా రెండు వేల మంది పాల్గొనే పేషెంట్లు, 20 మంది డాక్టర్స్, వివిధ రంగాల వాలంటీర్ల సహకారంతో మెడికల్ క్యాంపు జరుగుతుందన్నారు. ఆదివారం జరిగే క్యాంపులో వేసవికాలం దష్ట్యా రూ.400కు నాలుగు నెలలకు సరిపడా మందులు, తక్కువ ధరకే ఇన్సులిన్ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. క్యాంపునకు వచ్చే పాత, కొత్త పేషెంట్లు ఒక రోజు ముందు టెస్ట్‌లు చేయించుకొని రిపోర్ట్‌తో రావాలని, గత క్యాంపులో ఇచ్చిన మందుల చీటీ తప్పనిసరిగా తీసుకుని క్యాంపునకు రావాలన్నారు. ఈ అవకాశాన్ని పేద రోగులందరూ వినియోగించు కోవాలని, మరిన్ని వివరాలకు 94903 00076, 94903 24140, 89851 44140 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

'కిమ్స్'లో మహిళలకు ఉచిత ఓపి

ప్రజాశక్తి-ఒంగోలు

మార్చి 8న ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో మహిళలకు ప్రత్యేక ప్యాకేజీలు నిర్వహిస్తున్నట్లు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె.అంకిరెడ్డి తెలిపారు. హాస్పిటల్‌లో శుక్రవారం ప్రత్యేక ప్యాకేజీలకు సంబంధించిన బ్రోచర్‌ను కిమ్స్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి శ్రీహరిరెడ్డి, గైనకాలిజిస్ట్ డాక్టర్ కల్పన గింజుపల్లి, డాక్టర్ సుజని సుంకర, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె.అంకిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ గైనకాలజీ విభాగం నందు హైరిస్క్ ప్రెగ్నెన్సీ, నార్మల్ డెలివరీ, సిజేరియన్ సెక్షన్స్, ల్యాప్రోస్కోపిక్ ద్వారా సర్జరీలు, పెయిన్లెస్ డెలివరీలు అతి తక్కువ ఖర్చుతో చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్యాకేజీలు మార్చి 4 నుండి మార్చి 20 వరకు అందిస్తామన్నారు. ఈ ప్యాకేజీలో మహిళలకు ప్రసూతి మరియు స్త్రీల వైద్య విభాగంలో ఉచిత ఓపి, అన్ని రకాల పరీక్షలపై 50 శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న జెవివి రాష్ట్ర కోశాధికారి కె.శ్రీనివాస్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిజాయతీపరులనే గెలిపిద్దాం


జెవివి రాష్ట్ర కోశాధికారి కె.శ్రీనివాస్ పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఈ నెల 13న జరుగనున్న శాసనమండలి ఎన్నికల్లో నిజాయతీగా నిలబడాలని, నిజాయతీపరులనే గెలిపించాలని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కోశాధికారి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న శాసనమండలి అభ్యర్థుల జెవివి ప్రచార కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించగలిగేది, ప్రజల తరపున పోట్లాడగలిగేది పిడిఎఫ్ అభ్యర్థులు మాత్రమేనన్నారు. ప్రకాశం- నెల్లూరు -చిత్తూరు నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలను గెలిపించాలని ఆయన కోరారు. కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో అనంతరం జెవివి రాష్ట్ర ప్రచురణల విభాగం కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ జయప్రకాష్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎన్‌టి వెంకటేశ్ పాల్గొన్నారు.

మహిళ కడుపు నుంచి కణితి తొలగింపు

వైద్యబృందాన్ని అభినందించిన జిజిహెచ్ సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్



వైద్యబృందాన్ని అభినందిస్తున్న సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్, ఇన్‌సెట్లో తొలగించిన 4 కిలోల కణితి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మహిళ కడుపు నుంచి నాలుగు కిలోల కణితిని వైద్యులు విజయవంతంగా తొలగించారు. కణితిని బయటకు తీసిన గైనకాలజీ వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. భగవాన్‌నాయక్ అభినందించారు. ఈ సందర్భంగా జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. భగవాన్‌నాయక్ మాట్లాడుతూ జిజిహెచ్‌లో అంకిత భావం కలిగిన వైద్యులతో క్లిష్టతరమైన, సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందుతున్నాయన్నారు. గత నెల 21న జరుగుమల్లి మండలం, పచ్చవ గ్రామానికి చెందిన కనపర్తి సంపూర్ణ కడుపులో కణితి వుందన్న అనుమానంతో ఆసుపత్రిలో చేరిందన్నారు. గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో వైద్య బందం.. నిర్ధారణ పరీక్షలు అనంతరం కడుపులో గర్భాశయం వద్ద నాలుగు కిలోల బరువున్న (36 నెలల) కణితిని గుర్తించారన్నారు. శస్త్ర చికిత్స ద్వారానే కణితిని తొలగించడం సాధ్యమని భావించి డాక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో వైద్య బందం విజయవంతంగా శస్త్ర చికిత్స చేసి కణితిని తొలగించడం జరిగిందని తెలిపారు. ఇప్పుడు ఆ మహిళ ఆరోగ్యంగా ఉన్నారన్నారు. శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్ శ్రీదేవి (హెచ్ఒడి), డాక్టర్ హైందవి, డాక్టర్ బి.ప్రసన్న, డాక్టర్ శ్రీను, అనస్థీషియా డాక్టర్ ప్రణీత్ బందాన్ని ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో రోగులకు మంచి వైద్యం అందించడం జరుగుతుందన్నారు. శస్త్రచికిత్స చేయించుకున్న మహిళలకి ఆరోగ్యశ్రీ ఆసరా ద్వారా ఆర్థికసాయం అందిస్తామని గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి తెలిపారు.

గ్యాస్ ధరలు తగ్గించాల్సిందే..

ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి


ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలని స్థానిక సత్యనారాయణపురంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రవ వానికి ఐద్వా నగర నాయకురాలు గందవల్ల కల్యాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఒకవైపు నిత్యవసర వస్తువుల ధరలు నిత్యం పెరుగుతూ ఉంటే నియంత్రించాల్సిన ప్రభుత్వం గుడ్లప్పగించి చూస్తోందన్నారు. ధరలు తగ్గించకపోగా ప్రజల మీద విపరీతమైన భారాలు మోపటం అమానుషమన్నారు. గత రెండు నెలల కాలంలో రెండు సార్లు సిలిండర్ ధర పెంచారని, ఎన్నికలకు ముందు పేద, మధ్యతరగతి ప్రజలకు ఇచ్చే సబ్సిడీని కొనసాగిస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం పూర్తిగా ఎత్తేసిందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చే నాటికి రూ.400 లోపు ఉన్న గహ వినియోగదారుల సిలిండర్ ధర నేడు రూ.1155 దాటిందని, వాణిజ్య సిలిండర్ ధర రూ.2250 రూపాయలకు పెంచారన్నారు. ఈ పెరుగుదలతో చిరువత్తులు, టీ, టిఫిన్ కొట్లు, హొటళ్ళ నిర్వాహకులు ధరలు పెంచుతారని అంతిమంగా అవి ప్రజలపై భారం అవుతుందన్నారు. తక్షణమే ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని, సబ్సిడీలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఐద్వా నగర కార్యదర్శి గంగవరపు ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రజల ఆర్థిక పరిస్థితులు దిగజారుతున్నాయని, కరోనా అనంతరం మరింత భారంగా మారుతున్నాయన్నారు. ఈ స్థితిలో ప్రజల జీవితాలపై ప్రభుత్వం భారాలు మోపటం అన్యాయమన్నారు. ధరలు పెరుగుతున్నంత వేగంగా ప్రజల ఆదాయాలు పెరగటం లేదని, ఆర్థిక భారాలతో కుటుంబాలు అవస్థలు పడుతున్నాయన్నారు. ఐద్వా జిల్లా నాయకురాలు బి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆహార ధాన్యాల ధరలపై నియంత్రణను తొలగించిందని, ఇష్టారీతిన ధరలు పెంచుతూ ఉంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి, ప్రధాన ప్రతిపక్షాలు స్పందించకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు వై. అంజనీదేవి, కె.అరుణ, యన్ హరిణి, కె.కోటేశ్వరమ్మ, ఏ సత్యవతి, ఆర్ తులశమ్మ, అరుణ వి.విజయలక్ష్మి, కె.ఉద్యమ, కె. ఈశ్వరమ్మ, పి.జ్యోతి, యం. నాగమణి, శైలజ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలు

పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి

అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు పూర్తి చేసిన పనులకు ప్రభుత్వం నుంచి చెల్లింపులు పొందిన కాంట్రాక్టర్లు తదుపరి పనులను సత్వరమే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ లు, బిఎంసియుల నిర్మాణ పనుల పురోగతిపై శుక్రవారం ఆయన ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నియోజక వర్గాల వారీగా సమీక్షించారు. పెండింగ్ బిల్లులు ఉంటే ఈ నెలాఖరులోపు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఎస్ఆర్. రేట్ల విషయంలో సందేహాలు ఉంటే స్పష్టత కోసం పంచాయతీరాజ్ కమిషనర్‌కు లేఖ రాయాలని సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ పథకానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుండటంతో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణంపై ప్రత్యేక దష్టి పెట్టాలని కలెక్టర్ స్పష్టంచేశారు. ఇప్పటికే పూర్తయిన హెల్త్ క్లినిక్ భవనాలను ఏఈఈలు, డిఈఈలు, పరిశీలించి వచ్చే వారం ఆరోగ్య శాఖకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ. కొండయ్య, ఈఈలు, డిఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ రమేష్

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం కృషి

జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ సూచించారు. మార్కాపురం, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్, కెజిబివి, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి ఎ.చంద్రమౌళీశ్వర్ అధ్యక్షతన జరిగిన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ మాట్లాడుతూ విద్యావ్యవస్థకు సంబంధించిన కార్యక్రమాల్లో భాగమైన మన బడి, నాడు-నేడు, బైజూస్ ట్యాబ్స్ వినియోగం, మధ్యాహ్న భోజనం, జగనన్న విద్యాకానుక, పదోతరగతి పరీక్షలు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయులు నిరంతరం దృష్టి సారించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల స్థాయిలో ప్రభుత్వం ఇచ్చే విద్యా సంబంధిత ఆదేశాల అమలులో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం పాటు పడాలని కోరారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి, విద్యా, సాంస్కృతిక, క్రీడా వికాసంలో పాఠశాల పాత్ర అత్యంత కీలకంగా ఉండాలన్నారు. త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో మార్కాపురం ఎంఇఒ బి.రాందాస్‌నాయక్, స్థానిక జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖరరెడ్డి, ఇతర మండలాల ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించటంలో విఫలం

ప్రజాశక్తి-చీరాల

మహిళలపై నిత్యం అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని, మహిళలకు రక్షణ కల్పించడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకున్న సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలతో ఆమె ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రజల, ఉద్యోగుల, శ్రామిక అన్నివర్గాల ప్రజల సమస్యలు పరిష్కారం జరగాలంటే జరగనున్న శాసనమండలి ఎన్నికలలో ప్రజల సమస్యలపై ప్రశ్నించి పరిష్కరించే పిడిఎఫ్ అభ్యర్థులయిన గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి, మరియు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబిరెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి.. గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం అంగనవాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖ ఎలిజిబెత్ మాట్లాడుతూ శ్రామిక రంగంలో మహిళల కష్టాన్ని ప్రభుత్వాలు దోచుకుంటున్నాయని, తక్షణమే బడ్జెట్‌లో నిధులు పెంచి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయరంగ రాష్ట్ర నాయకులు శివనాగరాణి, ఆశా రంగం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరమ్మ, ఆర్పీ పట్టణ కార్యదర్శి సుకన్య పాల్గొన్నారు.

కందులాపురం సెంటర్లో రాస్తారోకో

ప్రజాశక్తి-కంభం రూరల్

పట్టణంలోని కందుల పురం సెంటర్లో అంబేద్కర్ విగ్రహం పక్కన ఉన్న ఎమ్మార్పీఎస్ జెండాను తొలగించినందుకు నిరసనగా ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం సాయంత్రం కందులాపురం సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఎమ్మార్పీఎస్ నాయకులకు సుమారు గంట సేపటికి పైగా వాగ్వివాదం జరిగింది. కంభం ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావు హుటాహుటిన సంఘటనాస్థలానికి వచ్చి ఎమ్మార్పీఎస్ నాయకులకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.